తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం - 02- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 28 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# కష్టపడితేనే విజయం: కవిత



మెహదీపట్నంలో ఉద్యోగ మేళాలో పాల్గొన్న కవిత
అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పించాలని సూచన
యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపు

హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):

మెహదీపట్నంలోని కింగ్స్ ప్యాలెస్‌లో నిర్వహించిన ఉద్యోగ మేళాలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ విజయానికి ఎలాంటి అడ్డదారులు ఉండవని, కేవలం కష్టపడితేనే లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. ఉద్యోగ ఇంటర్వ్యూలలో అబద్ధాలు చెప్పకుండా నిజాయితీగా సమాధానాలు ఇవ్వాలని, తమపై తాము నమ్మకం పెంచుకోవాలని సూచించారు. ఈ ఉద్యోగ మేళాలో దాదాపు 150 సంస్థలు పాల్గొని రెండు వేల ఉద్యోగ అవకాశాలను కల్పించడం అభినందనీయమని కవిత అన్నారు. అర్హత ఉన్న ప్రతి అభ్యర్థికి న్యాయంగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంస్థల ప్రతినిధులను కోరారు. ఇంజినీరింగ్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన వారితో పాటు పదో తరగతి ఉత్తీర్ణులైన యువత కూడా ఈ ఉద్యోగ మేళాకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని పేర్కొన్నారు.

## వైద్యులకు ఈటల వందనం

- డాక్టర్స్ డే సందర్భంగా రీహాబిలిటేషన్ వార్డు ప్రారంభం
- వైద్యులను సన్మానించి సేవలను కొనియాడిన ఈటల రాజేందర్
- కరోనా సమయంలో వైద్యుల త్యాగాలను గుర్తుచేసిన బీజేపీ ఎంపీ

హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):

రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురంలో డాక్టర్స్ డే సందర్భంగా లక్ష్మీ హెల్త్ కేర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రీహాబిలిటేషన్ వార్డును బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన డాక్టర్స్ డే వేడుకల్లో పాల్గొని వైద్యులను సన్మానించారు. పలువురు వైద్యులకు అవార్డులు అందజేసి వారి సేవలను అభినందించారు.

మిగతా 2లో







## రైతు బకాయిలపై కేటీఆర్ ఫైర్

- రైతు హామీలు పూర్తిగా అమలు చేయాలి
- ముందుగా బకాయిలన్నీ చెల్లించాలని డిమాండ్
- తర్వాతే రైతు సభలు నిర్వహించాలి

హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతు ఆశీర్వాద సభలు నిర్వహించడం ప్రజలను మోసం చేయడమేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రైతులను అన్ని విధాలుగా నిరాశపరిచిన ప్రభుత్వం ఇప్పుడు రైతు సంక్షేమం పేరుతో సభలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. ముందుగా రైతులకు ఇవ్వాల్సిన బకాయిలన్నీ చెల్లించి, ఆ తర్వాతే ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మొత్తం రూ.1.13 లక్షల కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి

మిగతా 2లో




## హైదరాబాద్‌కు ఏఐ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థ

ముఖ్యమంత్రి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ ప్రతినిధులతో కీలక సమావేశం
మేధో నగరాల నిర్మాణంపై విస్తృత చర్చ

హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. అనలాగ్ సంస్థ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యనిర్వాహక అధికారి అలెక్స్ కిప్‌మన్, ఎంఈఐఎల్ సంస్థ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో కృత్రిమ మేధ ఆధారిత ట్రాఫిక్ సిగ్నల్ నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేసి అమలు

మిగతా 2లో




## బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి తీవ్ర విమర్శలు

- కేసీఆర్ కుటుంబ ఆస్తులు, రాష్ట్ర అప్పులపై ఆరోపణలు
- వచ్చే ఎన్నికల్లో ప్రజలే తీర్పు ఇస్తారని వ్యాఖ్య

హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలపై భారీ అప్పుల భారం మోపడంతో పాటు కేసీఆర్ కుటుంబ ఆస్తులు పెరిగాయని ఆరోపించారు.

మిగతా 2లో


File Photo

## ఆదాయ సమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- శాఖల వారీగా లక్ష్యాల సాధనకు సీఎం కీలక ఆదేశాలు
- వాస్తవిక బడ్జెట్‌తో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచన




హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):
రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలను సాధించాలంటే ఆదాయ సమీకరణపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదాయ వనరులను పెంచేందుకు

మిగతా 2లో

## పూడిక తీయగా బయటపడిన మృతదేహం

- మోతుకుల కుంట ఔట్‌లెట్ నాలాలో కలకలం
- మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



మేడ్చల్–మల్కాజిగిరి, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):
మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పూడిక తొలగింపు పనుల సందర్భంగా గుర్తుతెలియని మృతదేహం బయటపడటం కలకలం రేపింది. అల్వాల్ మండలం మచ్చబొల్లారంలోని మోతుకుల కుంట ఔట్‌లెట్ నాలాలో హైడ్రా, విపత్తు స్పందన బృందాలు సంయుక్తంగా పూడిక

మిగతా 8లో

## తెలంగాణ–కర్ణాటక సరిహద్దులో ఉద్రిక్తత

- మల్గి గ్రామం వద్ద చెత్త వివాదం ముదిరింది
- బీదర్–మల్గి రహదారిపై చెత్త పారబోసడంతో రాకపోకలకు అంతరాయం

సంగారెడ్డి, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంగారెడ్డి జిల్లా సరిహద్దులోని మల్గి గ్రామం వద్ద బీదర్ మున్సిపాలిటీ చెత్త పారబోయడాన్ని గ్రామస్థులు గత పదిహేను రోజులుగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ గ్రామ శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడంతో పర్యావరణ కాలుష్యం పెరగడమే కాకుండా ప్రజలు

మిగతా 8లో





## సింగరేణి ఆందోళనకు బీఆర్ఎస్ మద్దతు

- శ్రీరాంపూర్‌లో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న హరీశ్ రావు
- పీఆర్‌పీ, పీఆర్సీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హైదరాబాద్‌కు ఏఐ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)




చేయాలని సూచించారు. నగరంలో వాహన రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ సిగ్నళ్లు స్వయం చాలకంగా స్పందించే విధంగా వ్యవస్థను రూపొందించాలని కోరారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరంలో రాకపోకలను మరింత సులభతరం చేయడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రత్యక్ష పరిస్థితులను విశ్లేషిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించే సాంకేతిక వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

సమావేశంలో అనలాగ్, ఎంఈఐఎల్ ప్రతినిధులు తమ సంయుక్త భాగస్వామ్యంతో దేశంలో మేధో ఆధారిత మౌలిక వసతుల అభివృద్ధికి రూపొందించిన కార్యాచరణను వివరించారు. హైదరాబాద్‌లో చేపట్టిన ట్రాఫిక్ ప్రయోగాత్మక ప్రాజెక్టు పురోగతిని ప్రభుత్వానికి వివరించారు. మేధో సాంకేతిక వ్యవస్థల ద్వారా ట్రాఫిక్ ప్రవాహాన్ని సమర్థంగా నియంత్రించడం, తక్షణ నిర్ణయాలు తీసుకునే విధానాలను ప్రదర్శించారు. అలాగే మేధో నగరాల నిర్మాణం, కృత్రిమ మేధ ఆధారిత మౌలిక వసతుల వినియోగంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. విద్యుత్, విద్యుత్ ప్రసార వ్యవస్థ, ప్రజా మౌలిక వసతులు, వైద్య ఆరోగ్యం, నీటి నిర్వహణ, రవాణా, సాగునీటి రంగాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని ప్రతినిధులు వివరించారు. సమాచార ఆధారిత ప్రణాళికలతో స్థిరమైన పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా అనలాగ్, ఎంఈఐఎల్ సంస్థల మధ్య సంయుక్త భాగస్వామ్య ఒప్పంద పత్రాల మార్పిడి జరిగింది. రాష్ట్రంలో వినూత్న సాంకేతిక పరిజ్ఞానంతో మౌలిక వసతుల అభివృద్ధికి ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. తెలంగాణను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు.

# కష్టపడితేనే విజయం: కవిత

(మొదటి పేజీ తరువాయి)



ఉద్యోగ ఇంటర్వ్యూలలో తెలిసిన విషయాలనే చెప్పాలని, తెలియని విషయాలను దాచిపెట్టకుండా నిజాయితీగా అంగీకరించాలని కవిత సూచించారు. అవసరమైతే కొంత సమయం ఇస్తే నేర్చుకుని పని చేస్తానని చెప్పడం తప్పుకాదన్నారు. నిజాయితీ, నేర్చుకోవాలనే తపన ఉన్న వారిని సంస్థలు తప్పకుండా గుర్తిస్తాయని యువతకు ధైర్యం చెప్పారు. తన వ్యక్తిగత అనుభవాన్ని కూడా ఈ సందర్భంగా కవిత పంచుకున్నారు. 2001లో అమెరికాలో ఉద్యోగాల కొరత ఉన్న సమయంలో తాను ఇంటర్వ్యూకు హాజరయ్యానని, కొన్ని ప్రశ్నలకు సమాధానం తెలియదని స్పష్టంగా చెప్పానని తెలిపారు. అయితే 20 రోజులు అవకాశం ఇస్తే నేర్చుకుంటానని చెప్పడంతో సంస్థ అవకాశం ఇచ్చిందని, ఆ సమయంలో కష్టపడి నేర్చుకుని ఉద్యోగం సాధించానని వివరించారు. ప్రస్తుతం ఏ నైపుణ్యాన్నైనా నేర్చుకోవడానికి ఎన్నో ఉచిత వనరులు అందుబాటులో ఉన్నాయని కవిత అన్నారు. ముఖ్యంగా అంతర్జాల వేదికల ద్వారా అనేక అంశాలను నేర్చుకోవచ్చని, యువత నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విజయానికి కష్టపడటం ఒక్కటే మార్గమని, అదే భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం వృత్తి విద్యా కళాశాలల్లో అధిక సంఖ్యలో యువతులు చేరుతున్నారని, వారికి కూడా ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని కవిత అన్నారు. ఉద్యోగం వస్తుందనే ఆత్మవిశ్వాసంతో ప్రయత్నాలు కొనసాగించాలని, ఒకసారి విఫలమైనా నిరుత్సాహపడకుండా మళ్లీ ప్రయత్నించాలని యువతకు పిలుపునిచ్చారు. ఆత్మవిశ్వాసం, నిజాయితీ, కృషి ఉంటే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆమె పేర్కొన్నారు.



# ఆదాయ సమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి శాఖ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆదాయం పెంపుతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ, తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థతో పాటు వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనుల శాఖలు ఆదాయ సమీకరణలో మరింత చురుకుగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆదాయానికి సంబంధించిన ఎలాంటి లీకేజీలు జరగకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని, ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు చేరేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

ఆదాయ సమీకరణ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక అనుసరణ విభాగాన్ని ఏర్పాటు చేసి నిరంతరం సమీక్షించాలని ముఖ్యమంత్రి సూచించారు. శాఖల వారీగా లక్ష్యాల సాధనను పరిశీలిస్తూ లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని చెప్పారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని సకాలంలో వసూలు చేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల సామర్థ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి సేవల సామర్థ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. కృత్రిమ మేధస్సు సాంకేతికతను వినియోగించి లబ్ధిదారుల వివరాలను ప్రత్యక్ష నగదు బదిలీ వ్యవస్థతో అనుసంధానం చేయడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, ప్రభుత్వ పథకాల అమలు మరింత సమర్థవంతంగా సాగుతుందని అభిప్రాయపడ్డారు.

పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేసే విధంగా శాఖలు బడ్జెట్ ప్రణాళికలను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఊహాజనిత అంచనాలపై కాకుండా వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఆదాయ సమీకరణ కీలకమని, ప్రతి శాఖ సమర్థవంతంగా పనిచేసి లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# వైద్యులకు ఈటల వందనం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ వైద్యులను భగవంతునితో పోలుస్తారని, "వైద్యో నారాయణో హరిః" అనే మాట వారి సేవలకు నిదర్శనమని అన్నారు. తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు నిరంతరం కృషి చేస్తారని కొనియాడారు. ఎంత మంది రోగులు వచ్చినా ఓర్పుతో సేవలందించడం వైద్య వృత్తి గొప్పతనమని పేర్కొన్నారు.

కరోనా మహమ్మారి సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది ఎదుర్కొన్న సవాళ్లను ఈటల రాజేందర్ గుర్తుచేశారు. ఆ సమయంలో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నప్పటికీ వైద్యులు వెనుకడుగు వేయకుండా సేవలందించారని అన్నారు. మహేంద్రహిల్స్ ప్రాంతంలో తొలి కరోనా కేసు నమోదైన సమయంలో నెలకొన్న పరిస్థితులను కూడా ఆయన వివరించారు. కరోనా సమయంలో ప్రజల్లో ధైర్యం నింపేందుకు తాను స్వయంగా ఆసుపత్రికి వెళ్లి పరిస్థితిని సమీక్షించానని ఈటల తెలిపారు. వైద్యులు, సిబ్బందికి అండగా నిలుస్తూ అవసరమైన రక్షణ పరికరాలు, శానిటైజర్లు, మందులు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. కరోనా వంటి విపత్తును యుద్ధప్రాతిపదికన ఎదుర్కొన్నామని పేర్కొన్నారు.

మనిషి ఎంత శక్తివంతుడినని భావించినా ప్రకృతి ముందు ఎంత చిన్నవాడో కరోనా ప్రపంచానికి తెలియజేసిందని ఈటల అన్నారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన వైద్యులు, నర్సులు, పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి నిజమైన హీరోలని కొనియాడారు. వారి సేవలను ఎప్పటికీ మరవలేమని చెప్పారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ శుభాకాంక్షలు తెలిపిన ఈటల రాజేందర్, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇదే అంకితభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరెడ్డి, పలువురు పార్టీ నాయకులు, వైద్యులు, ఆసుపత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతు బకాయిలపై కేటీఆర్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ఉందని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద రూ.30 వేల కోట్లు, కౌలు రైతులకు రూ.22,500 కోట్లు, రుణమాఫీ కింద రూ.29,500 కోట్లు, రైతు కూలీలకు రూ.15 వేల కోట్లు, పంట బోనస్ కింద రూ.16 వేల కోట్లు బకాయిలుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ఒక్క ప్రధాన హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రైతు కూలీలకు భరోసా వంటి అంశాలన్నీ ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. రైతుల కష్టాలు తీర్చాల్సిన ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలకే పరిమితమైందని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా రైతు ఆశీర్వాద సభలు నిర్వహించడం అట్టర్ ఫ్లాప్ అయిన సినిమాకు అర్ధశత దినోత్సవం నిర్వహించినట్లే ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విస్మరించి వేడుకలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ప్రజలు వాస్తవ పరిస్థితులను గమనిస్తున్నారని పేర్కొన్నారు.




వ్యవసాయ రంగం బలోపేతం కావాలంటే ముందుగా రైతులకు రావాల్సిన ప్రతి రూపాయి అందాలని కేటీఆర్ అన్నారు. బకాయిలు చెల్లించకుండా రైతుల పట్ల ప్రేమ చూపిస్తున్నట్లు ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. రైతుల నమ్మకాన్ని పొందాలంటే మాట ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సూచించారు. దమ్ముంటే ముందుగా రైతులకు ఇవ్వాల్సిన రూ.1.13 లక్షల కోట్ల బకాయిలను పూర్తిగా చెల్లించాలని, ఆ తర్వాతే రైతు ఉత్సవాలు, రైతు ఆశీర్వాద సభలు నిర్వహించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. రైతుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వాలంటే మాటల కంటే చేతలతో నిరూపించాలని, రైతు సంక్షేమమే ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత కావాలని ఆయన స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)



ఈ మేరకు మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి పలు ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకత్వంపై ఉందని అన్నారు. పదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలపై లక్షల కోట్ల రూపాయల అప్పుల భారం పడిందని, అదే సమయంలో కేసీఆర్ కుటుంబ ఆస్తులు భారీగా పెరిగాయని మంత్రి ఆరోపించారు. ఈ పరిస్థితి ఎలా ఏర్పడిందో ప్రజలకు వివరించాలని కేటీఆర్‌ను డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన ఆర్థిక వ్యవహారాలపై ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో వైఫల్యాలు చోటుచేసుకున్నాయని మంత్రి విమర్శించారు. ప్రజల నుంచి దూరమైన కారణంగానే బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్న తీరు కూడా ప్రజల అంచనాలకు అనుగుణంగా లేదని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, ఆ అంశంపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యలకు పాల్పడిన వారు ఇప్పుడు నీతులు చెప్పడం సమంజసం కాదని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అంశాలపై విచారణలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

రాబోయే ఎన్నికల్లో ప్రజలు మరోసారి తమ తీర్పు ఇస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆదరిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న పథకాలతో ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. ప్రజల మద్దతుతో కూటమి ప్రభుత్వం మరింత బలపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా, మంత్రి చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. రాజకీయ వర్గాల్లో ఈ వ్యాఖ్యలపై చర్చ కొనసాగుతోంది.

# సింగరేణి ఆందోళనకు బీఆర్ఎస్ మద్దతు

**మంచిర్యాల, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి కోల్ మైన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీఆర్పీ, పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ ఉపపక్ష నేత హరీశ్ రావు పాల్గొని ఆందోళన చేస్తున్న అధికారులతో సంఘీభావం తెలిపారు. అధికారుల న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, సింగరేణి చరిత్రలో కార్మికులు సమ్మెలు చేయడం సాధారణమే అయినప్పటికీ, ఇప్పుడు అధికారులు కూడా నిరాహార దీక్షలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. అధికారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది పనితీరు ఆధారిత ప్రోత్సాహక వేతనం క్రమం తప్పకుండా చెల్లించామని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం గత రెండేళ్లుగా ఆ ప్రోత్సాహకాన్ని నిలిపివేయడంతో అధికారులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారని అన్నారు. దీనివల్ల ఉద్యోగుల్లో ఉత్సాహం తగ్గి బొగ్గు ఉత్పత్తిపై కూడా ప్రభావం పడిందని ఆయన ఆరోపించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గడం వల్ల రాష్ట్రంలోని కొన్ని ఉష్ణ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి దెబ్బతిన్నదని హరీశ్ రావు పేర్కొన్నారు. దీంతో రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను బయట నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. సింగరేణి సంస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కోల్ ఇండియాలో ఇప్పటికే అమలు చేస్తున్న వేతనాల మెరుగుదల విధానాన్ని సింగరేణిలో కూడా ఆలస్యం చేయకుండా అమలు చేయాలని హరీశ్ రావు కోరారు. బదిలీలు, పదోన్నతుల్లో రాజకీయ జోక్యాన్ని తొలగించి గతంలో అమలులో ఉన్న పారదర్శక కౌన్సెలింగ్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అధికారుల సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని సూచించారు. ఆందోళన చేస్తున్న అధికారులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని, వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని హరీశ్ రావు భరోసా ఇచ్చారు. రాబోయే శాసనసభ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. కాగా, ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం లేదా సింగరేణి యాజమాన్యం నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వనపర్తిలో రూ.22 కోట్లతో ఐటీ టవర్‌కు శంకుస్థాపన

- జిల్లా అభివృద్ధికి మరో కీలక అడుగు
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి,జులై01(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కేంద్రంలో రూ.22 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక ఐటీ టవర్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనపర్తిని ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు.ఐటీ టవర్ నిర్మాణం ద్వారా జిల్లా యువతకు స్థానికంగానే ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు సాఫ్ట్‌వేర్ కంపెనీలు, స్టార్టప్ సంస్థలు వనపర్తికి వచ్చే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. అలాగే జిల్లాకు కొత్త పెట్టుబడులు ఆకర్షితమై అభివృద్ధికి ఊతమిస్తుందని పేర్కొన్నారు.ఐటీ టవర్ నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మాధవి రమేష్, వైస్ ఛైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరే రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తలనీలాల కోసం రేకుల షెడ్డు నిర్మాణానికి శ్రీకారం



**పెద్దమందడి,జులై01( తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలోని చౌట చెరువు కట్ట సమీపంలో దశదినకర్మల సందర్భంగా తలనీలాలు తీయించుకునేందుకు వచ్చే గ్రామ ప్రజలకు సరైన వసతులు లేక ఎన్నో సంవత్సరాలుగా వర్షాకాలం, ఎండాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ప్రజల సౌకర్యార్థం తలనీలాలు తీయించుకునేందుకు రేకుల షెడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం గ్రామ పంచాయతీ బాధ్యత అని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో రేకుల షెడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్ కుమార్, గ్రామ పెద్దలు సూచన మునిరాములు, పోతుల రామిరెడ్డి, గర్రెమోని బాలరాజు, శ్రీకాంత్ రెడ్డి, సుంచారమ్మని విజయ్, మందడి శ్రీను, కావాలి హరీష్, బోడి గణేష్, ముప్పూరి రాములు, మండ్ల రాజు, మండ్ల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెంచు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

- సమస్యల పరిష్కారానికి అధికారులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాలు



**వనపర్తి,జూలై01(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణంలోని 10వ వార్డులో నివసిస్తున్న చెంచు మహిళలకు బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెంచు మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ఆవాస ప్రాంతంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, తాగునీటి బోరు తవ్వించాలని, గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.వారి సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి వెంటనే అవసరమైన చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని స్థానిక కౌన్సిలర్ మధుసూదన్ గౌడ్‌తో పాటు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మాధవి రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరే రాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బ్రహ్మాచారి, బి. కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి చేరికల జోరు!

- ఆరేకోడు నుంచి అధికార పార్టీలోకి బీఆర్ఎస్, సీపీఎం ముఖ్య నేతలు
- కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి పొంగులేటి క్యాంపు ఇన్‌చార్జి దయాకర్ రెడ్డి




**ఖమ్మం బ్యూరో, జులై 1(తెలంగాణ ముచ్చట్లు ):** మండల పరిధిలో కాంగ్రెస్ పార్టీలోకి వలసల జోరు కొనసాగుతోంది. బుధవారం ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోట వీరభద్రం ఆధ్వర్యంలో ఆరేకోడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్, సీపీఎం పార్టీల ముఖ్య నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీపీఎం ముఖ్య నేత పేరెల్లి మధు, బీఆర్ఎస్ ముఖ్య నేత ఎనిగండ్ల రాంబాబు తమ అనుచరులతో కలిసి అధికార పార్టీ బాట పట్టారు. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజా రంజక పాలన, నియోజకవర్గంలో జరుగుతున్న విస్తృత అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతున్నాయని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలివేరు బాబు, గునిగంటి రమేష్, ఉప్పుగండ్ల ప్రసాద్, గునిగంటి సురేష్, కుసుమ రాజ, అరేంపుల రామారావు, మహిళా నాయకురాళ్లు గన్నోజు గోవిందమ్మ, అరేంపుల సునీత తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డు అభివృద్ధిపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే



**వనపర్తి, జూలై01( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతులకు అందిస్తున్న సేవలు, ఆర్థిక లావాదేవీల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మార్కెట్ వ్యవస్థ పారదర్శకంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. మార్కెట్ ఆదాయం, వ్యయాల వివరాలతో పాటు భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై సభ్యులతో కలిసి చర్చించారు.రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా మార్కెట్ యార్డులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా పదవీకాలం పూర్తిచేసుకున్న మార్కెట్ యార్డు అధ్యక్షుడు, డైరెక్టర్లను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి అభినందించారు.ఈ సమావేశంలో మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, డైరెక్టర్లు కృష్ణయ్య, గోపాల్ నాయక్, సురేష్, ఓమేష్, లతీఫ్, శారద, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం



- ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్

**ఖమ్మం బ్యూరో ,జూలై1(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843) ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ ఆదేశాల మేరకు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో, జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఖమ్మం అర్బన్ పరిధిలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో బుధవారం నాడు ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సమాజ రక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న వైద్యులతో ఈ పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని చేపట్టడం విశేషం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రెహనా బేగం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు, ప్రముఖ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ రాజకుమారి తదితరులు విచ్చేశారు. వీరంతా టి డబ్ల్యూ జె ఎఫ్ హెచ్ 2843 యూనియన్ సభ్యులతో కలిసి, అర్బన్ పార్క్‌లో పలు రకాల మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత, వైద్య నిపుణులు మొక్కలు నాటిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్య సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజానికి ఆరోగ్యం ఎంత ముఖ్యమో, ప్రకృతి ఆరోగ్యంగా ఉండటం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. కోటి మొక్కల ప్రదాత, పద్మశ్రీ వనజీవి రామయ్య పుట్టినరోజు కూడా ఇదే రోజు కావడం, ఆయన జన్మదినం సందర్భంగా మేమంతా ఇక్కడ మొక్కలు నాటే భాగ్యం కలగడం ఎంతో గర్వంగా ఉంది. మానవాళి మనుగడకు ఆక్సిజన్ అందించే చెట్లను నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చు. డాక్టర్ రెహనా బేగం, డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు వైద్యులు నిరంతరం రోగుల సేవలో బిజీగా ఉన్నప్పటికీ, జర్నలిస్టుల పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణ కోసం ముందుకు రావడం అభినందనీయమని టి డబ్ల్యూ జే ఎఫ్ హెచ్ 2843 యూనియన్ సభ్యులు కొనియాడారు. డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున లేదా ముఖ్యమైన రోజుల్లో కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టుల సామాజిక బాధ్యత

టిడబ్ల్యూజేఫ్ హెచ్2843 యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ, నగేష్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ మాట్లాడుతూ, టీడబ్ల్యూజేహెచ్ 2843 వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య దిశా నిర్దేశంలో కేవలం జర్నలిస్టుల సంక్షేమమే కాకుండా,సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజాన్ని రోగాల బారి నుండి కాపాడే డాక్టర్ల చేతుల మీదుగా, పర్యావరణాన్ని కాపాడే మొక్కలను నాటించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వేములకొండ రమేష్, ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నల్లా రాకేష్ రెడ్డి, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వందనపు సామ్రాట్ గుప్తా, కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు అమరబోయిన ఉపేందర్, చెరుకుమల్లి సతీష్, జిల్లా సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, టీబీజేఏ నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, కప్పల మధు గౌడ్, మీరా, ప్రెస్ క్లబ్ కార్యదర్శి మల్లెల శిల్ప చౌదరి, స్వాతి, రమాదేవి, ప్రజా జ్యోతి విలేకరులు, పి.శ్రీనివాస్, నాగబాబు, డి.శ్రీనివాస్, బి.శ్రీను, బి.రాధాకృష్ణ, రామకృష్ణ బాబు, కార్యవర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, అర్బన్ పార్క్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి: ఆర్డీవో జలకుమారి



**హుజూరాబాద్ జులై 01(తెలంగాణ ముచ్చట్లు ):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని హుజూరాబాద్ ఆర్డీవో జలకుమారి అధికారులకు, బీఎల్‌వోలకు సూచించారు. బుధవారం హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జూన్ చివరి వారంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సమన్వయంతో నిర్వహించాలని అన్నారు.

ప్రతి ప్రాంతంలోని ప్రతి ఓటరుకు గణన ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, బీఎల్‌వోలు, బీఎల్ఏలు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. గణన ఫారాలు నింపే సమయంలో ఓటర్లకు తలెత్తే సందేహాలను వెంటనే నివృత్తి చేసి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్డీవో జలకుమారి స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఓటు నమోదు ప్రక్రియపై కళాప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం




**పెద్దమందడి,జులై01(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మరియు తెలంగాణ సాంస్కృతిక సారథి సంయుక్త ఆధ్వర్యంలో కళాప్రదర్శనలు నిర్వహించారు.ఈ సందర్భంగా కళాకారులు ఆటలు, పాటల ద్వారా ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేయించుకోవాలని, వివరాల్లో ఉన్న తప్పులను సరిచేసుకోవాలని, ఒకే చోట ఓటు ఉండేలా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే ఓటును ప్రజాస్వామ్యంలో పాలకులను ఎన్నుకునే వజ్రాయుధంగా భావించి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సందేశం అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండు అశోక్, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, కళాబృందం నాయకుడు గుడిసె శివలింగం, సువర్ణ, శ్రీనివాసులు, కృష్ణయ్య, శ్రీదేవి, రాధాతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్స్ డే సందర్భంగా డా. తక్కళ్లపెల్లి ప్రదీప్‌కు ఘన సన్మానం



**హుజూరాబాద్,జులై 01(తెలంగాణ ముచ్చట్లు ):** జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా బొమ్మకల్ గ్రామ సర్పంచ్ వేముల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సూపర్ బజార్‌లోని 24/7 బాలాజీ హాస్పిటల్‌లో ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందిస్తున్న డా. తక్కళ్లపెల్లి ప్రదీప్‌ను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి వారి సేవలను కొనియాడారు.

ఈ సందర్భంగా సర్పంచ్ వేముల శ్రీకాంత్ మాట్లాడుతూ, "వైద్యో నారాయణో హరి" అనే మాటకు నిలువెత్తు నిదర్శనంగా వైద్యులు తమ సేవలను అందిస్తున్నారని అన్నారు. రోగుల ఆరోగ్యమే లక్ష్యంగా పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తున్న డా. తక్కళ్లపెల్లి ప్రదీప్ వంటి వైద్యులు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం ఎంతో గొప్ప సేవ అని పేర్కొంటూ, డాక్టర్స్ డే సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. డా. తక్కళ్లపెల్లి ప్రదీప్ మాట్లాడుతూ, డాక్టర్స్ డే సందర్భంగా తనను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. వైద్య వృత్తి కేవలం ఉద్యోగం కాదని, అది మానవ సేవకు అంకితమైన బాధ్యత అని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని, ప్రజల ఆరోగ్య పరిరక్షణే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తనపై చూపుతున్న ప్రేమాభిమానాలకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు కృష్ణ, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సభ్యులు శ్రీనివాస్, కొండల్ రెడ్డి, సాయి, అజయ్, అఖిల్‌తో పాటు హాస్పిటల్ సిబ్బంది పాల్గొని డాక్టర్ ప్రదీప్‌కు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతంను కలిసిన కొమ్ము వెంకటస్వామి



**వనపర్తి,జూలై01(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతంను వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, శ్రామిక అవార్డు గ్రహీత దయ్యాల దాసు హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూలై 5న జరగనున్న కొమ్ము వెంకటస్వామి సోదరుడి వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఆహ్వాన పత్రికను స్వీకరించిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం, వివాహ వేడుకకు తప్పకుండా హాజరై వధూవరులను ఆశీర్వదిస్తానని హామీ ఇచ్చారు. అలాగే కొమ్ము వెంకటస్వామి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వివాహం విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించిన నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్ ...రిమాండ్‌కు తరలింపు

- **32 లక్షల విలువ చేసే 32 తులాల బంగారు ఆభరణాలు రికవరీ**
- **మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన టౌన్ ఏసీపీ రమణమూర్తి, సీసీఎస్ ఏసీపీ సర్వర్**



**ఖమ్మం బ్యూరో, జులై 1(తెలంగాణ ముచ్చట్లు):** గత కొన్ని నెలలుగా రాత్రి పూట తాళం వేసిన ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. మంగళవారం సాయంత్రం నగరంలోని కిన్నెర హోటల్ ఎదురుగా వున్న పెట్రోల్ బంక్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న ఖమ్మం టూ టౌన్, సిసిఎస్ పోలీసులకు అనుమానస్పదంగా కనిపించిన ఆత్కూరు గ్రామం, మధిర మండలం, ఖమ్మం జిల్లా సెన్ట్రింగ్ వర్కర్ అయిన నిందితుడు కంబంపాటి ఏసోబు @ కందుల సురేష్ రెడ్డి, 45సం ను అదుపులోకి తీసుకొని విచారించగా గత కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్ళల్లో దొంగతనాలు చేసి, పలుసార్లు జైలు శిక్షలు అనుభవించాడని ,ఇతనిపై గతంలో 22 దొంగతనాల కేసులలో నిందితుడు గా ఉన్నట్లు తెలిపారు. నిందితుడు నుండి 32 లక్షల విలువ చేసే 32 తులాల బంగారు ఆభరణాలు, 40 వేల రూపాయల విలువ చేసే వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకునట్లు తెలిపారు.

గత సంవత్సరం నుండి వివిధ పోలీస్ స్టేషన్ ల పరిధిలో చేసిన దొంగతనాల వివరాల ప్రకారం...1) ఖమ్మం 2వ టౌన్ 4 2)ఖానాపురం హవేలీ 3 3) వేంసూరు 1,4) వి ఎం బంజర 1, 5)చిల్లకల్లు 1, 6) తిరువూరు 1 ల్లో దొంగతనాలు చేసాడని ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఇన్స్పెక్టర్లు, కరుణాకర్, బాలకృష్ణ, భానుప్రకాష్, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమ పథకాలు బోర్డు ద్వారానే అమలు చేయాలి

- **ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దని సీఐటీయూ డిమాండ్.**
- **దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ.**
- **పెండింగ్ క్లెయిమ్‌ల విడుదల, పరిహారం–పెన్షన్ పెంపునకు విజ్ఞప్తి.**



**దమ్మపేట, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించకుండా వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. తాపీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ప్రయోజనాలను కార్మికులకు అందకుండా చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.12ను తీసుకురావడం దురదృష్టకరమన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను ప్రైవేట్ బ్రోకర్ సంస్థలకు అప్పగించడం ద్వారా కార్మికుల హక్కులకు భంగం కలుగుతోందని విమర్శించారు. కార్మికులకు ఉపయోగం లేని సీఎస్సీ హెల్త్ టెస్టుల పేరుతో వెల్ఫేర్ బోర్డు సెస్ నిధులను వందల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని, సహజ మరణ పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, 55 సంవత్సరాలు పూర్తిచేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.6 వేల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. అలాగే వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని వెంటనే నియమించి, సెస్ నిధులను పూర్తిగా కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దయాకర్, నాయకులు నారాయణ, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ చరిత్రను యువతకు తెలియజేయాలి

### అడ్డూరి అనిల్ మాదిగ



**ఎల్కతుర్తి, జులై 01 (తెలంగాణ ముచ్చట్లు):** ఎమ్మార్పీఎస్ ఉద్యమ చరిత్రను నేటి యువతకు విస్తృతంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల కోఆర్డినేటర్ అడ్డూరి అనిల్ మాదిగ అన్నారు. బుధవారం ఎల్కతుర్తిలో ఆయన మాట్లాడుతూ, సామాజిక న్యాయం, మాదిగల హక్కుల సాధన, ఎస్సీ వర్గీకరణ లక్ష్యాలతో ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలకు పైగా నిరంతర పోరాటం చేస్తోందన్నారు.

ఉద్యమ నిర్మాత, పద్మశ్రీ పురస్కార గ్రహీత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగిన ఉద్యమ చరిత్ర, సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లను యువతకు తెలియజేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో ఉద్యమ చరిత్రపై అవగాహన కార్యక్రమాలు, చర్చా వేదికలు, యువతతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

ఉద్యమ ఆశయాలు, సామాజిక న్యాయం కోసం సాగిన పోరాటాలను ప్రజలకు వివరించి ఉద్యమ స్ఫూర్తిని మరింత బలోపేతం చేయాలని అన్నారు. మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజనులు, మహిళలు, గ్రామ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని అడ్డూరి అనిల్ మాదిగ పిలుపునిచ్చారు.

# 'చిన్నారులే వైద్యులైన వేళ'






- **స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం.**

**ఖమ్మం బ్యూరో, జులై 1(తెలంగాణ ముచ్చట్లు ):** వైద్యాన్ని మహా యజ్ఞంగా భావించి తన వద్దకి వచ్చిన ప్రతి ప్రాణాన్ని కంటికి రెప్పలా కాచుకునే ప్రత్యక్ష దైవం వైద్యుడే అని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల కరెస్పాండంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య అన్నారు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు పలు స్కిట్ లు ప్రదర్శించి, మానవ జీవితంలో వైద్య వృత్తి గొప్పతనాన్ని చాటి చెప్పారు. ఉపాధ్యాయులు చిన్నారులకి వైద్యులు ఎంత విలువైన వారు అనేది వివరించారు. అనంతరం స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలోని పేరెంట్స్ మరియు వైద్య వృత్తి లో రాణిస్తూ,రోగులకు విశేష సేవలు అందిస్తున్న పలువురు వైద్యులకి మెమెంటోలతో సత్కరించటం జరిగింది.

# వివో ఫోన్ల ధరలు పెంపు.. రూ.7 వేల వరకు భారమైన కొత్త రేట్లు

భారత్‌లో ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వివో తన పలు స్మార్ట్‌ఫోన్ మోడళ్ల ధరలను పెంచింది. ఎక్స్, వీ, టీ, వై సిరీస్‌లకు చెందిన మొత్తం తొమ్మిది మోడళ్లపై రూ.2,000 నుంచి రూ.7,000 వరకు ధరలు పెంచినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఇందులో వివో ఎక్స్300 ఎఫ్ఈ మోడల్‌పై అత్యధికంగా రూ.7,000 పెంపు నమోదైంది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్‌లో మెమరీ చిప్‌ల ధరలు పెరగడం, సరఫరా వ్యవస్థపై ఒత్తిడి, తయారీ వ్యయాలు అధికం కావడం వల్లే కంపెనీ ధరలను సవరించినట్లు తెలుస్తోంది. అయితే ధరల పెంపుపై వివో అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ధరలు పెరిగిన మోడళ్లలో వివో ఎక్స్300 ఎఫ్ఈ, వివో వీ70 ఎఫ్ఈ, టీ4 లైట్ 5జీ, వై51 ప్రో, వై31 5జీ, టీ5ఎక్స్, వై21, వై11, వై05 ఉన్నాయి. వీటిలో కొన్ని మోడళ్లకు గతంలో కూడా ధరలు పెరగగా, ఇప్పుడు మరోసారి సవరణ చేయడంతో ప్రారంభ ధరలతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల నమోదైంది.తాజా ధరల ప్రకారం, వివో ఎక్స్300 ఎఫ్ఈ 12 జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.86,999కు చేరగా, 12 జీబీ ర్యామ్, 512 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.96,999గా నిర్ణయించారు. ధరల పెంపుతో ఈ మోడల్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో ఇతర ఫ్లాగ్‌షిప్ పరికరాలతో మరింత పోటీ ఎదుర్కోనుంది.





# కాపురాల్లో పెరుగుతున్న క్రూరత్వం..!

- **వరకట్న వేధింపులతో మరో నవ వధువు బలి**
- **దేశవ్యాప్తంగా కొనసాగుతున్న గృహహింస ఘటనలపై ఆందోళన**

కర్ణాటకలోని ధార్వాడ్ జిల్లాలో జరిగిన ఓ యువ స్టాఫ్ నర్స్ హత్య మరోసారి దేశవ్యాప్తంగా మహిళల భద్రత, వరకట్న వేధింపులపై తీవ్ర చర్చకు దారితీసింది. 29 ఏళ్ల ప్రియాంక కమలాకర్ అనే యువతి వివాహమైన కొన్ని నెలలకే భర్త చేతిలో ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. డబ్బు, బంగారం కోసం వేధింపులు, మానసిక హింస, కుటుంబ కలహాలు చివరకు హత్యకు దారితీశాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి భర్తతో పాటు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, ప్రియాంకకు 2024 డిసెంబర్‌లో బసవరాజ్ వడ్డార్‌తో వివాహమైంది. పెళ్లైన కొద్ది రోజులకే అదనపు వరకట్నం తీసుకురావాలని ఒత్తిడి ప్రారంభమైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితురాలి శరీరాకృతిని అవమానిస్తూ మానసికంగా వేధించేవాడని, తరచూ గొడవలు జరిగేవని పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి ఆమెను గొంతు నులిమి హత్య చేసినట్లు కేసు నమోదు చేశారు. ఈ ఒక్క ఘటన మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది వేలాది మహిళలు వరకట్న వేధింపులు, గృహహింస, అనుమానాస్పద మరణాలకు బలవుతున్నారని జాతీయ నేర గణాంకాలు సూచిస్తున్నాయి. వివాహం తర్వాత వేధింపులు, ఆర్థిక ఒత్తిళ్లు, అనుమానాలు, మానసిక హింస అనేక కుటుంబాల్లో మహిళల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. చట్టాలు ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు పూర్తిగా తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మహిళలపై హింసను అరికట్టేందుకు వరకట్న నిషేధ చట్టం, గృహహింస నిరోధక చట్టం వంటి నిబంధనలు అమల్లో ఉన్నా, వాటి అమలులో మరింత కట్టుదిట్టమైన చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. బాధితులు చాలా సందర్భాల్లో కుటుంబ పరువు, సామాజిక ఒత్తిళ్లు, భవిష్యత్తుపై భయంతో ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారని మహిళా హక్కుల సంఘాలు చెబుతున్నాయి. ప్రారంభ దశలోనే ఫిర్యాదులపై స్పందించి బాధితులకు రక్షణ కల్పిస్తే ఇలాంటి విషాదాలను నివారించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

సామాజికంగా కూడా మార్పు అవసరమని నిపుణులు చెబుతున్నారు. వివాహాన్ని ఆర్థిక లావాదేవీగా కాకుండా పరస్పర గౌరవం, విశ్వాసంతో కూడిన బంధంగా చూడాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. కుమార్తెలకు విద్య, ఆర్థిక స్వావలంబనతో పాటు చట్టాలపై అవగాహన కల్పించడం, కుమారులకు మహిళలను గౌరవించే విలువలను చిన్ననాటి నుంచే నేర్పించడం ద్వారా మాత్రమే ఇలాంటి ఘటనలు తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ధార్వాడ్ ఘటన మరోసారి సమాజాన్ని ఆలోచింపజేస్తోంది. వరకట్నం, గృహహింస వంటి సామాజిక రుగ్మతలపై ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థతో పాటు సమాజం కూడా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి మహిళ సురక్షితంగా, గౌరవంగా జీవించే వాతావరణం కల్పించడమే ఇలాంటి ఘటనలకు శాశ్వత పరిష్కారమని వారు సూచిస్తున్నారు.



# పాక్‌పై తాలిబన్ల ప్రతిదాడి..!

## సరిహద్దులో మళ్లీ యుద్ధ మేఘాలు

- **డ్రోన్లతో పాక్ భూభాగంలోని లక్ష్యాలపై దాడులు**
- **ఐసిస్ స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని తాలిబన్ వెల్లడి**
- **వైమానిక దాడులకు ప్రతీకారమేనంటూ అంతర్జాతీయ దృష్టి**
- **ఇరు దేశాల ఆరోపణలతో మరింత ఉద్రిక్తమైన పరిస్థితులు**

పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు మరోసారి ఉద్రిక్తంగా మారింది. ఇటీవల పాకిస్థాన్ నిర్వహించిన వైమానిక దాడుల అనంతరం, ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్ బలగాలు పాకిస్థాన్ భూభాగంలోని లక్ష్యాలపై డ్రోన్ దాడులు నిర్వహించినట్లు ప్రకటించాయి. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతాల్లోని ఐసిస్ ఖొరాసన్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేపట్టినట్లు తాలిబన్ పేర్కొంది. ఈ ఘటనతో రెండు దేశాల మధ్య ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. తమ దాడులు ఉగ్రవాద మౌలిక స్థావరాలపైనే జరిగాయని, పాకిస్థాన్ భూభాగాన్ని ఉపయోగించుకుని ఐసిస్ ఖొరాసన్ సంస్థ ఆఫ్ఘనిస్థాన్‌లో దాడులకు కుట్రలు పన్నుతోందని తాలిబన్ ఆరోపించింది. పౌరులకు ఎలాంటి హాని కలగకుండా అత్యంత జాగ్రత్తగా ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపింది. అయితే ఈ దాడులపై పాకిస్థాన్ అధికారికంగా భిన్నమైన వివరాలు వెల్లడిస్తూ, కొన్ని డ్రోన్లను కూల్చివేసినట్లు పేర్కొంది. ఈ పరిణామాలకు కొద్ది రోజుల క్రితం పాకిస్థాన్ ఆఫ్ఘనిస్థాన్‌లో నిర్వహించిన వైమానిక, భూతల దాడులే కారణమని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పాకిస్థాన్ మాత్రం తమ భూభాగంలో వరుస ఉగ్రదాడులకు పాల్పడుతున్న మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకున్నామని చెబుతుండగా, ఆ దాడుల్లో పెద్ద సంఖ్యలో పౌరులు మరణించారని తాలిబన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. పౌరుల మృతుల సంఖ్యపై ఇరు దేశాలు భిన్నమైన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి ప్రకారం పాకిస్థాన్ దాడుల్లో కనీసం 28 మంది పౌరులు మరణించగా, 49 మంది గాయపడ్డారు. మరోవైపు ఆఫ్ఘన్ అధికారులు మరణాల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉందని చెబుతున్నారు. పాకిస్థాన్ మాత్రం తమ ఆపరేషన్‌లో ఉగ్రవాదులే హతమయ్యారని ప్రకటిస్తోంది. ఈ పరిణామాలపై భారత్ కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ నిర్వహించిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ, అవి ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి ముప్పుగా మారుతున్నాయని పేర్కొంది. సరిహద్దు ఉద్రిక్తతలు మరింత పెరిగితే మొత్తం దక్షిణాసియా భద్రతా పరిస్థితులపై ప్రభావం పడే అవకాశముందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.




# మెరుపు ప్యాకింగ్.. నకిలీ సరుకు..!

దేశవ్యాప్తంగా నకిలీ వస్తువుల వ్యాపారం రోజురోజుకూ విస్తరిస్తూ వినియోగదారులను తీవ్రంగా మోసం చేస్తోంది. ఒకప్పుడు కేవలం నకిలీ దుస్తులు, చెప్పులు, గడియారాలకే పరిమితమైన ఈ అక్రమ వ్యాపారం ఇప్పుడు మందులు, సౌందర్య ఉత్పత్తులు, విద్యుత్ పరికరాలు, ఆహార పదార్థాలు, వాహనాల విడిభాగాలు, పిల్లల బొమ్మలు, విత్తనాలు, ఎరువులు వంటి అనేక రంగాలకు విస్తరించింది. అసలు ఉత్పత్తుల మాదిరిగానే ప్యాకింగ్, గుర్తులు, లేబుళ్లు తయారు చేయడంతో సాధారణ వినియోగదారుడు అసలు, నకిలీ వస్తువుల మధ్య తేడాను గుర్తించలేక మోసపోతున్నాడు. నకిలీ వస్తువుల వల్ల కలిగే నష్టం కేవలం ఆర్థికపరంగానే కాదు. నాసిరకం ముడి పదార్థాలతో తయారయ్యే మందులు ప్రాణాలకే ప్రమాదంగా మారుతున్నాయి. నకిలీ విద్యుత్ పరికరాల వల్ల అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు పెరుగుతున్నాయి. నాణ్యత లేని ఆహార పదార్థాలు, సౌందర్య ఉత్పత్తులు ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. రైతులు కొనుగోలు చేసే నకిలీ విత్తనాలు, ఎరువులు పంట దిగుబడిని దెబ్బతీసి భారీ ఆర్థిక నష్టాలను మిగులుస్తున్నాయి. ఇలా ప్రతి రంగంలోనూ నకిలీ ఉత్పత్తులు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరగడంతో నకిలీ ఉత్పత్తుల విక్రయానికి కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. ఆకర్షణీయమైన ప్రకటనలు, భారీ తగ్గింపులు, అసలు బ్రాండ్ పేర్లతో పోలిన పేర్లు ఉపయోగిస్తూ కొందరు విక్రేతలు వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. వస్తువు చేతికి వచ్చిన తర్వాతే అది నకిలీ అని తెలిసే పరిస్థితి ఏర్పడుతోంది. సామాజిక మాధ్యమాలు, గుర్తింపు లేని వ్యాపార వేదికల ద్వారా జరిగే విక్రయాలు కూడా ఈ సమస్యను మరింత పెంచుతున్నాయి. నకిలీ వస్తువుల వ్యాపారం వల్ల నిజాయితీగా ఉత్పత్తులు తయారు చేస్తున్న సంస్థలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయి. పరిశోధన, నాణ్యత, భద్రతపై భారీగా పెట్టుబడులు పెట్టే కంపెనీలకు మార్కెట్‌లో అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయం కూడా తగ్గిపోతోంది. అక్రమ తయారీ, స్మగ్లింగ్, చట్టవిరుద్ధ వ్యాపారాలకు ఈ మార్కెట్ ప్రోత్సాహం లభిస్తోంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. ఈ సమస్యకు పరిష్కారం కేవలం ప్రభుత్వ చర్యలతోనే సాధ్యం కాదు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. కొనుగోలు చేసే ముందు ఉత్పత్తిపై ఉన్న నాణ్యత గుర్తులు, తయారీదారు వివరాలు, గడువు తేదీ, భద్రతా గుర్తులు పరిశీలించాలి. అత్యంత తక్కువ ధరలకు లభించే ఉత్పత్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అధికారిక విక్రయ కేంద్రాలు, విశ్వసనీయ దుకాణాలు, గుర్తింపు పొందిన ఆన్‌లైన్ వేదికల నుంచే కొనుగోళ్లు చేయడం మంచిది. నకిలీ వస్తువుల తయారీ, విక్రయాలపై చట్టాలు ఉన్నప్పటికీ అమలు మరింత కఠినంగా ఉండాల్సిన అవసరం ఉంది. తరచూ తనిఖీలు నిర్వహించడం, అక్రమ తయారీ కేంద్రాలను గుర్తించి మూసివేయడం, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడం, వినియోగదారుల ఫిర్యాదులకు వేగంగా స్పందించడం వంటి చర్యలు తీసుకోవాలి. అలాగే పాఠశాలల నుంచి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నకిలీ వస్తువులను గుర్తించే విధానాలపై ప్రచారం చేయాలి.

వేగంగా మారుతున్న మార్కెట్‌లో వినియోగదారుడి అప్రమత్తతే అతి పెద్ద రక్షణ. చౌక ధరల ఆకర్షణకు లోనై నాణ్యతను విస్మరిస్తే నష్టం తప్పదు. నకిలీ వస్తువుల వ్యాపారాన్ని అరికట్టాలంటే ప్రభుత్వం, తయారీ సంస్థలు, వ్యాపారులు, వినియోగదారులు సమష్టిగా బాధ్యత తీసుకోవాలి. అసలైన ఉత్పత్తులను ప్రోత్సహించడం, అనుమానాస్పద వస్తువులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా మాత్రమే ఈ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది.

# సమయపాలన.. వ్యక్తిగత విజయానికి తొలి అడుగు

ప్రపంచంలో ప్రతి మనిషికి సమానంగా లభించే ఏకైక సంపద సమయం. ధనవంతుడైనా, పేదవాడైనా, విద్యార్థైనా, ఉద్యోగైనా, వ్యాపారవేత్తైనా రోజుకు ఇరవై నాలుగు గంటలే లభిస్తాయి. ఈ సమయాన్ని ఎలా వినియోగించుకున్నామనే దానిపైనే వ్యక్తి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. డబ్బును కోల్పోతే తిరిగి సంపాదించుకోవచ్చు. కోల్పోయిన ఆస్తిని తిరిగి పొందవచ్చు. కానీ గడిచిపోయిన ఒక్క నిమిషాన్ని కూడా తిరిగి తీసుకురావడం అసాధ్యం. అందుకే సమయాన్ని అమూల్యమైన సంపదగా భావించి ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. జీవితంలో గొప్ప విజయాలు సాధించిన వ్యక్తులందరిలో కనిపించే ప్రధాన లక్షణం సమయపాలనే. నేటి సమాజంలో పోటీ ప్రతి రంగంలోనూ పెరుగుతోంది. విద్య, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం, పరిశోధనలు, క్రీడలు ఇలా ప్రతి రంగంలో ముందుండాలంటే సమయాన్ని సక్రమంగా నిర్వహించడం తప్పనిసరి. పనులను వాయిదా వేయడం, నిర్లక్ష్యం చేయడం, లక్ష్యం లేకుండా కాలం గడపడం వల్ల అవకాశాలు చేజారిపోతాయి. ఒకసారి కోల్పోయిన అవకాశం మళ్లీ దక్కుతుందనే హామీ ఉండదు. అందుకే ప్రతి పనికి ఒక ప్రణాళిక ఉండాలి. ఆ ప్రణాళికను సమయానికి అమలు చేసే క్రమశిక్షణ అలవడితేనే విజయం సాధించడం సులభమవుతుంది. సమయపాలన అంటే కేవలం గడియారం చూసుకుంటూ జీవించడం కాదు. ఏ పని ఎప్పుడు చేయాలి, దానికి ఎంత సమయం కేటాయించాలి, ఏ పనికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి అనే విషయాలను ముందుగానే నిర్ణయించుకోవడం నిజమైన సమయ నిర్వహణ. ప్రణాళిక లేకుండా చేసే పనులు ఎక్కువ సమయాన్ని వృథా చేస్తాయి. ఒక చిన్న ప్రణాళిక రోజంతా పనులను సులభంగా పూర్తి చేయడానికి దోహదపడుతుంది. ప్రతి రోజు చేయాల్సిన పనులను ముందురోజే రాసుకోవడం, వాటిని ప్రాధాన్యత ఆధారంగా పూర్తి చేయడం మంచి



అలవాటు. విద్యార్థుల జీవితంలో సమయపాలన అత్యంత కీలకమైన అంశం. చదువుకు మాత్రమే కాకుండా ఆటలు, వ్యాయామం, విశ్రాంతి, కుటుంబ సభ్యులతో గడిపే సమయానికి కూడా సరైన ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్షల సమయంలో చివరి నిమిషంలో పుస్తకాలు తిరగేయడం కంటే ప్రతిరోజూ కొద్దికొద్దిగా చదవడం మంచి ఫలితాలను ఇస్తుంది. సమయాన్ని సక్రమంగా వినియోగించుకునే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. భవిష్యత్తులో వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఇదే పునాది అవుతుంది. ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తే ప్రజలకు సేవలు మరింత మెరుగ్గా అందుతాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో సమయానికి పనులు పూర్తయితే ప్రజల నమ్మకం పెరుగుతుంది. ఆలస్యం తగ్గుతుంది. పరిశ్రమల్లో సమయపాలన ఉత్పాదకతను పెంచుతుంది. వ్యాపార రంగంలో నిర్ణీత సమయంలో నిర్ణయాలు తీసుకోవడం వల్ల సంస్థలు అభివృద్ధి చెందుతాయి. సమయాన్ని గౌరవించే వ్యక్తులు ఇతరుల సమయాన్ని కూడా గౌరవిస్తారు. ఇది ఆరోగ్యకరమైన సామాజిక సంస్కృతికి నాంది పలుకుతుంది. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం మన పనులను సులభతరం చేసింది. అయితే అదే సమయంలో సమయాన్ని వృథా చేసే ఎన్నో మార్గాలను కూడా సృష్టించింది. సామాజిక మాధ్యమాలు, లక్ష్యం లేని వీడియోల వీక్షణ, గంటల తరబడి మొబైల్ ఫోన్ వినియోగం, అనవసర చర్చలు వంటి అలవాట్లు విలువైన సమయాన్ని హరించేస్తున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు..

# హైదరాబాద్‌లో రూ.176 కోత



వాణిజ్య అవసరాల కోసం వినియోగించే 19 కిలోల ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరను ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భారీగా తగ్గించాయి. ఈ ఏడాదిలో కమర్షియల్ సిలిండర్ ధరలు తగ్గడం ఇదే తొలిసారి. సవరించిన కొత్త ధరలు జూలై 2 నుంచే అమల్లోకి వచ్చాయి. తాజా నిర్ణయంతో దేశంలోని ప్రధాన నగరాల్లో కమర్షియల్ సిలిండర్ ధరలు గణనీయంగా తగ్గాయి. ఢిల్లీలో సిలిండర్‌పై రూ.183.50 తగ్గడంతో ధర రూ.2,930కు చేరింది. హైదరాబాద్‌లో రూ.176 తగ్గి రూ.3,191గా నిర్ణయించారు. కోల్‌కతాలో రూ.174 తగ్గి రూ.3,081.50, చండీగఢ్‌లో రూ.181.50 తగ్గి రూ.2,954.50, పాట్నాలో రూ.173 తగ్గి రూ.3,227గా కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి.

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించడంతో పాటు, హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణా సాధారణ స్థితికి చేరుకోవడం కూడా ధరల తగ్గింపుకు దోహదపడింది.

అయితే గృహ వినియోగదారులకు మాత్రం ఈసారి కూడా ఊరట లభించలేదు. 14.2 కిలోల డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయకుండా యథాతథంగా కొనసాగించారు. ప్రస్తుతం ఢిల్లీలో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.942, ముంబైలో రూ.941.50, కోల్‌కతాలో రూ.968, చెన్నైలో రూ.957.50, హైదరాబాద్‌లో రూ.994గా కొనసాగుతోంది.

# జూన్‌లో జీఎస్టీ వసూళ్లు జోరు..



వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి బలమైన వృద్ధిని నమోదు చేశాయి. 2026 జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,94,812 కోట్లకు చేరిందని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది జూన్‌తో పోలిస్తే ఇది 13.9 శాతం అధికం. ముఖ్యంగా దిగుమతులపై వసూలైన పన్ను భారీగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది.

వివరాల ప్రకారం.. గత ఏడాది జూన్‌లో రూ.1,71,105 కోట్లుగా ఉన్న స్థూల జీఎస్టీ వసూళ్లు ఈసారి రూ.1,94,812 కోట్లకు చేరాయి. దిగుమతులపై జీఎస్టీ వసూళ్లు 34.6 శాతం పెరిగి రూ.60,038 కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 6.5 శాతం వృద్ధితో రూ.1,34,774 కోట్లకు చేరుకుంది.

రిఫండ్‌ల అనంతరం ప్రభుత్వానికి లభించిన నికర జీఎస్టీ ఆదాయం 11.2 శాతం పెరిగి రూ.1,62,377 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే నెలలో ఈ మొత్తం రూ.1,45,984 కోట్లుగా ఉంది. జూన్‌లో మొత్తం రిఫండ్‌లు దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లకు చేరాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లుగా నమోదవగా, ఎగుమతులకు సంబంధించిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లకు చేరుకున్నాయి.

నికర ఆదాయాన్ని పరిశీలిస్తే.. దేశీయ లావాదేవీలపై వచ్చిన జీఎస్టీ రాబడి 2.6 శాతం పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉండగా, దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం పెరిగి రూ.6,31,699 కోట్లకు చేరాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ ఆదాయం 7.1 శాతం వృద్ధితో రూ.5,40,218 కోట్లుగా నమోదైంది. వరుసగా రెండో నెల కూడా రూ.1.94 లక్షల కోట్లకు పైగా జీఎస్టీ వసూళ్లు నమోదవడం దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధికి సంకేతమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గింపు.. లీటర్‌పై రూ.5, రూ.3 కోత

దేశంలో ఇంధన ధరల్లో స్వల్ప ఊరట లభించింది. నయారా ఎనర్జీ దేశవ్యాప్తంగా తన రిటైల్ ఇంధన కేంద్రాల్లో పెట్రోల్ ధరను లీటర్‌కు రూ.5, డీజిల్ ధరను లీటర్‌కు రూ.3 చొప్పున తగ్గించింది. ఈ కొత్త ధరలు ఇప్పటికే 7,000కు పైగా నయారా రిటైల్ ఔట్‌లెట్లలో అమల్లోకి వచ్చాయి. గత రెండేళ్లలో ఒక ఇంధన రిటైల్ సంస్థ ధరలను తగ్గించడం ఇదే తొలిసారి.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడం, కీలక సముద్ర మార్గాలు తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే నయారా ఎనర్జీ ధరల తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్రాల వారీగా వ్యాట్ తదితర స్థానిక పన్నులు భిన్నంగా ఉండటంతో తుది రిటైల్ ధరల్లో స్వల్ప తేడాలు ఉండనున్నాయి.

నయారా ధరలు తగ్గించినప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు మాత్రం తమ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. దేశ ఇంధన మార్కెట్‌లో అధిక భాగస్వామ్యం కలిగిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలు పాత ధరలనే కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలో ఇండియన్ ఆయిల్ బంకుల్లో పెట్రోల్ లీటర్ ధర రూ.102.12, డీజిల్ ధర రూ.95.20గా కొనసాగుతోంది.

కాగా, ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో మార్చి 26న నయారా పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచింది. తాజా తగ్గింపుతో ఆ పెంపును పూర్తిగా వెనక్కి తీసుకుంది.

మరోవైపు, ప్రభుత్వరంగ చమురు సంస్థలు మే నెల ద్వితీయార్థంలో పలు దఫాలుగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.7.50 చొప్పున పెంచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం నయారా తీసుకున్న నిర్ణయం తర్వాత ఇతర సంస్థలు కూడా ధరలను సమీక్షిస్తాయా అనే అంశంపై వినియోగదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..




దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, రియల్టీ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు నమోదవడంతో ప్రధాన సూచీలు పైకి ఎగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 140.10 పాయింట్లు లేదా 0.59 శాతం లాభపడి 24,005.85 వద్ద స్థిరపడగా, సెన్సెక్స్ 443.97 పాయింట్లు లేదా 0.58 శాతం పెరిగి 76,922.64 వద్ద ముగిసింది.

మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, నిఫ్టీకి 24,100 నుంచి 24,200 స్థాయిలు కీలక నిరోధక ప్రాంతంగా ఉన్నాయి. ఈ స్థాయిని అధిగమిస్తే సూచీ 24,400 మార్కు దిశగా పయనించే అవకాశముందని పేర్కొన్నారు. మరోవైపు 23,900 నుంచి 23,800 స్థాయిలు బలమైన మద్దతు ప్రాంతాలుగా ఉండనున్నాయని తెలిపారు.

నిఫ్టీలో ఎటర్నల్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, నెస్లే ఇండియా షేర్లు అత్యధిక లాభాలు నమోదు చేసి మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. బ్రాడర్ మార్కెట్ కూడా సానుకూలంగా ముగియగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.36 శాతం మేర పెరిగాయి.

రంగాల వారీగా చూస్తే రియల్టీ, ఎఫ్ఎంసీజీ, ఆటో రంగాల షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి. అయితే ఐటీ, మెటల్, ఫార్మా రంగాల సూచీలు స్వల్ప ఒత్తిడిని ఎదుర్కొని బలహీనంగా ముగిశాయి.

అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై ఆశావహ అంచనాలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు తగ్గడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు అదుపులో ఉండటం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్ని చేకూర్చాయని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. దీంతో 2026 రెండో అర్ధభాగంలోకి దేశీయ ఈక్విటీ మార్కెట్లు ఆశాజనక వాతావరణంలో అడుగుపెట్టినట్లు వారు పేర్కొన్నారు.

## పసిడి ధరలు తగ్గుముఖం..



పసిడి డిమాండ్ దాదాపు 70 శాతం తగ్గినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్న నేపథ్యంలో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. పాత బంగారు నగలను విక్రయించేందుకు వినియోగదారులు ఎక్కువగా ముందుకు వస్తుండటంతో మార్కెట్‌లో డిమాండ్ తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

బుధవారం ఉదయం 11 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,780గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,29,050గా ఉంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,05,590గా కొనసాగుతోంది. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో ఒకే ధరలు నమోదయ్యాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి.

దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో బంగారం ధర అత్యధికంగా నమోదైంది. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,910గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,40,930, అహ్మదాబాద్‌లో రూ.1,40,830, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో రూ.1,40,780గా నమోదైంది.

## అల్లం, ఉల్లి ధరల భారం.. వారంలోనే భారీ పెరుగుదల



వంటింటి అవసరమైన అల్లం, ఉల్లిపాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం వారం రోజుల్లోనే అల్లం, ఉల్లి ధరలు గణనీయంగా పెరగడంతో కుటుంబాల నెలవారీ ఖర్చులు పెరిగాయి. గత వారం కిలో అల్లం ధర రూ.150 ఉండగా ప్రస్తుతం రూ.220కు చేరుకుంది. ఉల్లిపాయల ధర కూడా కిలోకు రూ.25 నుంచి రూ.40 వరకు పెరిగింది. హోల్‌సేల్ మార్కెట్లలో టన్ను ఉల్లిపాయ ధర రూ.2,400 నుంచి రూ.3,400కు పెరగడం గమనార్హం.

ధరల పెరుగుదలకు ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా తగ్గడమే ప్రధాన కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. హైదరాబాద్ మార్కెట్లకు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి అధికంగా అల్లం, ఉల్లిపాయలు వస్తుంటాయి. సాధారణంగా రోజుకు 150 నుంచి 170 లారీల వరకు సరుకు చేరుతుండగా, ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు, రవాణా సమస్యల కారణంగా సరఫరా గణనీయంగా తగ్గింది. దీంతో మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా నిల్వలు లేక ధరలు పెరిగాయి.

కొత్త పంట మార్కెట్‌లోకి వచ్చే వరకు ధరలు తగ్గే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. పంట పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాతే ధరలు సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అప్పటి వరకు వినియోగదారులు అధిక ధరల భారం భరించాల్సిన పరిస్థితి ఉంటుందని, ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వన్‌ప్లస్ కొత్త ఫోన్ విడుదల..



వన్‌ప్లస్ భారత మార్కెట్లో తన కొత్త 'ఎన్6' స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. బడ్జెట్, మిడ్‌రేంజ్ విభాగాన్ని లక్ష్యంగా తీసుకుని తీసుకొచ్చిన ఈ ఫోన్‌లో 8,000 ఎంఏహెచ్ భారీ బ్యాటరీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రూ.25 వేలలోపు ధరలో అందుబాటులోకి వచ్చిన ఈ ఫోన్ శక్తివంతమైన బ్యాటరీతో పాటు ఆధునిక ఫీచర్లను అందిస్తోంది.

ఈ ఫోన్‌లో 8,000 ఎంఏహెచ్ బ్యాటరీతో పాటు 45 వాట్ల సూపర్‌వూక్ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. 5 వాట్ల రివర్స్ వైర్డ్ ఛార్జింగ్ ఫీచర్ ద్వారా ఇతర పరికరాలను కూడా ఛార్జ్ చేసుకునే అవకాశం కల్పించారు. గేమింగ్ సమయంలో ఫోన్ వేడెక్కకుండా ఉండేందుకు బైపాస్ ఛార్జింగ్ సాంకేతికతను కూడా అందించారు. బ్యాటరీ 1,600కు పైగా ఛార్జింగ్ సైకిళ్లను తట్టుకుంటుందని, ఏడు సంవత్సరాల వినియోగం తర్వాత కూడా 80 శాతం సామర్థ్యాన్ని కొనసాగిస్తుందని కంపెనీ తెలిపింది.

వన్‌ప్లస్ ఎన్6లో 6.8 అంగుళాల హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లేతో పాటు 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 1,200 నిట్స్ గరిష్ఠ ప్రకాశాన్ని అందించారు. మీడియాటెక్ డైమెన్సిటీ 6360 మ్యాక్స్ ప్రాసెసర్‌తో పనిచేసే ఈ ఫోన్ 4 జీబీ, 6 జీబీ ర్యామ్ ఎంపికలతో 128 జీబీ స్టోరేజ్‌ను అందిస్తోంది. మైక్రో ఎస్‌డీ కార్డు ద్వారా స్టోరేజ్‌ను విస్తరించుకునే అవకాశం కూడా ఉంది.

ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆక్సిజన్ ఓఎస్ 16తో ఈ ఫోన్ పనిచేస్తుంది. రెండు ప్రధాన ఆండ్రాయిడ్ అప్‌డేట్లు, మూడు సంవత్సరాల భద్రతా అప్‌డేట్లు అందిస్తామని కంపెనీ ప్రకటించింది.


ఫోటోగ్రఫీ కోసం వెనుక భాగంలో 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా, ముందు భాగంలో 8 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరాను అందించారు. భారీ బ్యాటరీ, వేగవంతమైన ఛార్జింగ్, దీర్ఘకాలిక సాఫ్ట్‌వేర్ సపోర్ట్‌తో ఈ ఫోన్ బడ్జెట్ విభాగంలో వినియోగదారులను ఆకర్షించే అవకాశముందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# కాఫీ పౌడర్‌తో ముఖానికి సహజమైన మెరుపు

- **చర్మాన్ని తాజాగా కనిపించేలా చేయడంలో సహాయం**
- **మృతకణాల తొలగింపులో ఉపయోగకరం**
- **మితంగా వాడాలని సూచిస్తున్న నిపుణులు**

కాఫీ పౌడర్ కేవలం పానీయాల తయారీకే కాదు, చర్మ సంరక్షణలో కూడా ఉపయోగపడుతుందని చాలామంది నమ్ముతారు. ప్రస్తుతం ఇంట్లోనే తయారు చేసుకునే ఫేస్ ప్యాక్‌లలో కాఫీ పౌడర్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. కాఫీ పౌడర్‌ను ముఖానికి అప్లై చేయడం వల్ల చర్మంపై పేరుకుపోయిన మృతకణాలు తొలగడానికి సహాయపడుతుంది. దీంతో చర్మం కొంత మృదువుగా, తాజాగా కనిపించే అవకాశం ఉంటుంది. అలాగే కాఫీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని రక్షించడంలో తోడ్పడవచ్చని నిపుణులు చెబుతున్నారు. కొంతమంది కాఫీ పౌడర్‌ను పెరుగు, తేనె లేదా అలొవెరా జెల్‌తో కలిపి ఫేస్ ప్యాక్‌గా ఉపయోగిస్తుంటారు. ఇది చర్మానికి తాత్కాలిక మెరుపును అందించవచ్చు. అయితే ప్రతి ఒక్కరి చర్మం ఒకే విధంగా స్పందించదని గుర్తుంచుకోవాలి. సున్నితమైన చర్మం ఉన్నవారు కాఫీ పౌడర్‌ను ఎక్కువగా రుద్దడం వల్ల చర్మంపై చికాకు, ఎర్రదనం లేదా పొడిబారడం వంటి సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. అందుకే ముందుగా చిన్న భాగంలో పరీక్షించి తర్వాత ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. చర్మ సమస్యలు ఎక్కువగా ఉన్నవారు లేదా అలర్జీలు ఉన్నవారు ఇంటి చిట్కాల కంటే చర్మ వైద్యుల సలహా మేరకు ఉత్పత్తులను ఉపయోగించడం ఉత్తమం. కాఫీ పౌడర్‌ను మితంగా, సరైన పద్ధతిలో ఉపయోగిస్తే చర్మ సంరక్షణలో కొంత మేర ఉపయోగపడవచ్చని నిపుణులు చెబుతున్నారు.





## కొబ్బరి పీచుతో కలిగే ప్రయోజనాలు

మొక్కల పెంపకంలో సహజ వరం
పర్యావరణానికి మేలు చేసే పదార్థం
వ్యవసాయం, తోటల పెంపకంలో విస్తృత వినియోగం

**సాధారణంగా కొబ్బరికాయను ఉపయోగించిన తర్వాత మిగిలే కొబ్బరి పీచును చాలా మంది వ్యర్థంగా భావిస్తారు. అయితే ఈ పీచుకు అనేక ఉపయోగాలు ఉండటమే కాకుండా వ్యవసాయం, తోటల పెంపకంలో ఇది ఎంతో విలువైన పదార్థంగా మారిందని నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి పీచు నీటిని ఎక్కువసేపు నిల్వ ఉంచే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. దీంతో మొక్కలకు అవసరమైన తేమ ఎక్కువ కాలం అందుతుంది. ముఖ్యంగా కుండీల్లో మొక్కలు పెంచేవారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.అలాగే కొబ్బరి పీచు మట్టిలో గాలి ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీంతో మొక్కల వేర్లు ఆరోగ్యంగా పెరిగే అవకాశం ఉంటుంది. నర్సరీలు, టెర్రస్ గార్డెనింగ్‌లో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.పర్యావరణానికి హాని కలిగించని సహజ పదార్థం కావడంతో ప్లాస్టిక్ ఆధారిత ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా కూడా కొబ్బరి పీచు వినియోగం పెరుగుతోంది. తాళ్లు, మ్యాట్లు, బ్రష్‌లు, గార్డెనింగ్ ఉత్పత్తుల తయారీలో కూడా దీనిని ఉపయోగిస్తున్నారు. వ్యవసాయ నిపుణుల ప్రకారం, కొబ్బరి పీచు తక్కువ ఖర్చుతో లభించే సహజ వనరు. ఇది మట్టిలో తేమను నిల్వ ఉంచడమే కాకుండా మొక్కల పెరుగుదలకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తుంది. అందుకే ప్రస్తుతం సేంద్రియ వ్యవసాయంలో కొబ్బరి పీచు వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది.**

## పాదాల మంటతో ఇబ్బంది పడుతున్నారా? ఈ కారణాలు, చిట్కాలు తెలుసుకోండి

- **పాదాల్లో వేడి, మంటకు అనేక కారణాలు**
- **నీటి కొరత, పోషకాల లోపం కూడా కారణమే**
- **ఇంటి చిట్కాలతో పాటు అవసరమైతే వైద్యులను సంప్రదించాలి**



పాదాల్లో వేడి, మంట లేదా అసౌకర్యం అనేది చాలా మందిని ఇబ్బంది పెట్టే సాధారణ సమస్య. ముఖ్యంగా వేసవికాలంలో, ఎక్కువసేపు నిలబడే ఉద్యోగాలు చేసే వారిలో లేదా వయసు పెరిగే కొద్దీ ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. కొందరికి రాత్రి సమయంలో పాదాలు మండుతున్నట్లు అనిపించడం వల్ల నిద్రకు కూడా అంతరాయం కలుగుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, పాదాల్లో మంటకు అనేక కారణాలు ఉండవచ్చు. శరీరంలో నీటి కొరత, విటమిన్ B12 వంటి పోషకాల లోపం, అధిక ఒత్తిడి, నరాల బలహీనత, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు కూడా దీనికి కారణమయ్యే అవకాశం ఉంది. అలాగే రోజంతా బిగుతైన చెప్పులు ధరించడం, ఎక్కువసేపు నిలబడటం వల్ల కూడా పాదాల్లో వేడి పెరిగి మంట ఏర్పడవచ్చు.ఈ సమస్య నుంచి ఉపశమనం పొందేందుకు తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటే వేడి ప్రభావం తగ్గి పాదాల్లో మంట కూడా కొంతవరకు తగ్గుతుంది. రోజూ కనీసం అవసరమైన మోతాదులో నీరు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.చల్లటి లేదా గోరువెచ్చని నీటిలో కొద్దిసేపు పాదాలను ఉంచడం ద్వారా కూడా ఉపశమనం పొందవచ్చు. ఇది పాదాల కండరాలకు విశ్రాంతిని కలిగించి అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. కొబ్బరి నూనె, అలొవెరా జెల్ లేదా మాయిశ్చరైజర్‌తో పాదాలకు మృదువుగా మసాజ్ చేయడం వల్ల కూడా కొంత ఉపశమనం లభిస్తుంది.ఆహారంలో విటమిన్ B సమృద్ధిగా ఉండే పదార్థాలు, పండ్లు, ఆకుకూరలు, నట్స్, ధాన్యాలు చేర్చుకోవడం మంచిది. ఇవి నరాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ముఖ్యంగా మధుమేహంతో బాధపడేవారు తమ రక్తంలో చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా పరిశీలించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.అయితే పాదాల్లో మంట తరచుగా వస్తుంటే, నొప్పి, తిమ్మిరి లేదా స్పర్శ తెలియకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. ఇవి నరాల సమస్యలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు సంకేతాలు కావచ్చు. అలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.పాదాల పరిశుభ్రత పాటించడం, సౌకర్యవంతమైన చెప్పులు ధరించడం, తగినంత నీరు తాగడం, పోషకాహారం తీసుకోవడం వంటి అలవాట్ల ద్వారా పాదాల్లో మంట సమస్యను చాలావరకు నియంత్రించవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## పీరియడ్స్‌లో బొప్పాయి తినొచ్చా?

- **పీరియడ్స్ సమయంలో బొప్పాయి తినడం సాధారణంగా సురక్షితం**
- **జీర్ణక్రియ మెరుగుపడటానికి, పోషకాలు అందించడానికి సహాయపడుతుంది**
- **పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిదంటున్న నిపుణులు**



పీరియడ్స్ సమయంలో ఆహారం విషయంలో మహిళల్లో అనేక సందేహాలు ఉంటాయి. ముఖ్యంగా బొప్పాయి తినవచ్చా లేదా అనే ప్రశ్న తరచుగా వినిపిస్తుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, పీరియడ్స్ సమయంలో పండిన బొప్పాయి తినడం సాధారణంగా సురక్షితమే. బొప్పాయిలో విటమిన్ A, విటమిన్ C, ఫైబర్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. పీరియడ్స్ సమయంలో కొందరిలో కనిపించే మలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గించడంలో కూడా బొప్పాయి ఉపయోగపడవచ్చు. అంతేకాకుండా, బొప్పాయిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో తోడ్పడతాయి. పీరియడ్స్ సమయంలో పోషకాహారం తీసుకోవడం ముఖ్యమైనందున బొప్పాయి వంటి పండ్లను ఆహారంలో చేర్చుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయితే ఏ ఆహారమైనా మితంగా తీసుకోవడం మంచిది. ఒకవేళ బొప్పాయి తిన్న తర్వాత అలర్జీ, కడుపు అసౌకర్యం లేదా ఇతర సమస్యలు కనిపిస్తే వైద్యులను సంప్రదించడం అవసరం. పీరియడ్స్ సమయంలో తగినంత నీరు తాగడం, పండ్లు, కూరగాయలు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పూడిక తీయగా బయటపడిన మృతదేహం



(మొదటి పేజీ తరువాయి)

తొలగింపు పనులు చేపడుతుండగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మృతదేహం బయటపడటంతో అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల్లో పేరుకుపోయిన చెత్త, పూడికను భారీ యంత్రాలతో తొలగిస్తున్న సమయంలో ఈ మృతదేహం చెత్తతో కలిసి బయటకు వచ్చింది. సాధారణంగా పరుపులు, దిండ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతుండగా, ఈసారి మృతదేహం కనిపించడంతో అక్కడ ఉన్న అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే పనులను నిలిపివేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సమాచారం అందుకున్న అల్వాల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, గుర్తింపు కోసం చర్యలు ప్రారంభించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతదేహం సుమారు 15 రోజుల క్రితం నాటిదై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు ఎవరు, ఎలా నాలాలోకి చేరాడు, ప్రమాదవశాత్తూ మృతి చెందాడా లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. పరిసర ప్రాంతాల్లో అదృశ్యమైన వ్యక్తుల వివరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు సమీప ప్రాంతాల్లోని నిఘా దృశ్యాలను పరిశీలించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. మృతదేహం లభ్యమైన ప్రాంతాన్ని పూర్తిగా తనిఖీ చేసి, అవసరమైన నమూనాలను సేకరించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వర్షాకాలంలో నాలాల పరిశుభ్రత పనులు నిర్వహించే సమయంలో ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మృతదేహం గుర్తింపునకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



# తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో చెత్త వాహనాలను గ్రామంలోకి అనుమతించకుండా అడ్డుకుంటున్నారు. గ్రామస్థుల నిరసనలతో బీదర్ మున్సిపాలిటీ చెత్త రవాణా నిలిచిపోయినట్లు సమాచారం. డంపింగ్ యార్డును వెంటనే మరో ప్రాంతానికి తరలించాలని, గ్రామ ప్రజల ఆరోగ్యం, పంట పొలాలు, భూగర్భ జలాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు చెత్త వాహనాలను గ్రామ పరిసరాల్లోకి రానివ్వబోమని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు.

చెత్త వాహనాలను అడ్డుకుంటున్న గ్రామస్థులను బీదర్ మున్సిపల్ అధికారులు బెదిరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. "మీరు బీదర్‌కు ఎలా వస్తారో చూస్తాం" అంటూ హెచ్చరికలు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ఇరు ప్రాంతాల ప్రజల మధ్య ఉద్రిక్తతకు దారితీసిందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై బీదర్ మున్సిపాలిటీ నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. తాజాగా బీదర్-మల్లి ప్రధాన రహదారిపై సుమారు నలభై వాహనాల చెత్తను మున్సిపల్ అధికారులు పారబోసినట్లు గ్రామస్థులు ఆరోపించారు. దీంతో రహదారిపై దుర్వాసన వ్యాపించడంతో పాటు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసర పనుల కోసం వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు వెంటనే చెత్తను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ ఘటనతో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ఇరు రాష్ట్రాల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పరిస్థితి మరింత విషమించకుండా పోలీసులు పర్యవేక్షణ చేపట్టినట్లు సమాచారం. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. డంపింగ్ యార్డు వల్ల ఎదురవుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని మల్లి గ్రామస్థులు ప్రభుత్వాలను కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, గ్రామాల సమీపంలో చెత్త నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇరు రాష్ట్రాల అధికారులు కలిసి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



## చిన్నపెండ్యాలలో..

# ఘనంగా దళిత నాయకుల జన్మదిన వేడుకలు

చిల్పూర్,జులై01(తెలంగాణ ముచ్చట్లు):

చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన దళిత సంఘాల నాయకులు చుక్క మార్కు, ఇల్లెందుల యాకయ్య, ఇల్లెందుల యాకూబ్‌ల జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దళిత సంఘాల నాయకులు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారికీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి నాయకులను ఘనంగా సత్కరించారు.

సమాజ అభివృద్ధికి,దళితుల హక్కుల పరిరక్షణకు,ఆత్మ గౌరవం,అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి అందరం సంఘటితం కావాల్సిన అవసరం ఉందని అక్కడికి వచ్చిన నాయకులు ముక్త కంఠంతో ఏకీభవించారు.ఈ కార్యక్రమంలో గడ్డమీద మహేందర్, చుక్క రాజేష్,ఇల్లెందుల హరిబాబు, ఇల్లెందుల చంటి(విజయ్), బొల్లెపాక శ్రీనివాస్, గడ్డమీద ఎల్లయ్య, చుక్క శ్రీకాంత్, చిలుక అశోక్, ఇల్లెందుల శ్రీకాంత్, శెరిపల్లి సురేష్, ఇల్లెందుల రాజు, సారయ్య, సురేష్, అశోక్, రఘు వర్మ, రవి, పవన్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





# ఆడబిడ్డ జెండా ఎత్తింది..

## రాష్ట్ర అజెండా మారాల్సిందే: కవిత

- సీతాఫల్‌మండిలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ
- అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని హామీ
- ప్రభుత్వ హామీల అమలుపై కాంగ్రెస్‌పై విమర్శలు

హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా పండుగ సందర్భంగా సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో రాజకీయ అజెండా మారాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలనే సంకల్పంతోనే తాను పార్టీని స్థాపించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలంగాణ ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని కవిత విమర్శించారు. విద్య, వైద్యం ఇప్పటికీ సాధారణ కుటుంబాలకు భారంగా మారాయని అన్నారు. అందుకే టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పేదల జేబు నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కవిత ఆరోపించారు. ఆరు హామీల్లో ఒక్కదాన్ని కూడా పూర్తిగా అమలు చేయకుండా మళ్లీ ప్రజల మద్దతు కోరడం సమంజసం కాదన్నారు. పెన్షన్ల పెంపు, కొత్త ఇళ్ల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.

మూసీ ప్రాజెక్టు, మెట్రో వంటి భారీ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం పేదల అవసరాలను విస్మరిస్తోందని కవిత అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం నిధులు లేవని చెబుతూ, భారీ వ్యయంతో ప్రాజెక్టులు చేపట్టడం సరైన విధానం కాదన్నారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలు, స్వయం ఉపాధికి పెద్దపీట వేస్తామని కవిత తెలిపారు. డిగ్రీలు పూర్తి చేసిన యువతకు ఉద్యోగాలు రాకపోతే స్వయం ఉపాధి కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. విద్య, వైద్యం, ఉపాధి అంశాలనే తమ పార్టీ ప్రధాన అజెండాగా తీసుకెళ్తామని చెప్పారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోలేదని కవిత ఆరోపించారు. ఉద్యమకారులకు భూములు ఇస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యమని, ప్రజల కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకే పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే టీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి సంక్షేమ పాలన అందిస్తామని ఆమె తెలిపారు.



# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- జులై 3కి కేసు వాయిదా వేసిన హైకోర్టు
- ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ



హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):

పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను జులై 3వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణలో తమ వాదనలు వినిపించాలని ఆదేశించింది.

మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో పేట్ బషీరాబాద్ పోలీసులు బండి భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన చర్లపల్లి కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇటీవల పరీక్షలకు హాజరయ్యేందుకు కోర్టు వారంరోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేయగా, గడువు ముగియడంతో జూన్ 26న తిరిగి జైలుకు వెళ్లారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు గత మే నెలలో మొయినాబాద్‌లోని అనన్య హౌస్ ఫామ్‌హౌస్‌కు బండి భగీరథ్‌ను తీసుకెళ్లి ఘటన పునర్నిర్మాణం నిర్వహించారు. ఘటన జరిగినట్లు ఆరోపణలు ఉన్న ప్రాంతంలో నిందితుడితో కలిసి ఆ రోజు జరిగిన పరిణామాలపై వివరాలు సేకరించారు. ఫామ్‌హౌస్‌లో సుమారు గంటపాటు విచారణ నిర్వహించి కేసుకు సంబంధించిన కీలక అంశాలను నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం, డిసెంబర్ 31వ తేదీకి మూడు రోజుల ముందే ఆ ఫామ్‌హౌస్‌ను భగీరథ్ స్నేహితులు బుక్ చేసినట్లు గుర్తించారు. ఘటన జరిగిన రోజున భగీరథ్‌తో పాటు మరికొందరు అక్కడికి వెళ్లినట్లు పోలీసులు చెబుతున్నారు. ఫామ్‌హౌస్‌లో ఉన్న ఇతర వ్యక్తులను విచారణ పూర్తయ్యే వరకు ఒక గదిలో ఉండాలని పోలీసులు సూచించినట్లు సమాచారం. ఘటన పునర్నిర్మాణం అనంతరం నిందితుడిని కూకట్‌పల్లి డీసీపీ కార్యాలయానికి తరలించి, కేసు పర్యవేక్షణాధికారి సమక్షంలో మరోసారి విచారించారు. బాధితురాలితో పరిచయం, ఘటనకు ముందు, తర్వాత జరిగిన పరిణామాలపై వివరణలు సేకరించినట్లు సమాచారం. ఈ మొత్తం ప్రక్రియలో కోర్టు ఆదేశాల మేరకు నిందితుడి న్యాయవాదులు కూడా ఆయన వెంట ఉన్నట్లు తెలిసింది. కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో కొనసాగుతోంది. బెయిల్ పిటిషన్‌పై తుది నిర్ణయం హైకోర్టులో తదుపరి విచారణ అనంతరం వెలువడనుంది. కేసుకు సంబంధించిన దర్యాప్తును పోలీసులు కొనసాగిస్తుండగా, విచారణ పూర్తయ్యే వరకు మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# దేశంలోనే అరుదైన శస్త్రచికిత్సకు సీఎం అభినందనలు

హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ ముచ్చట్లు):



ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వైద్య బృందం నిర్వహించిన దేశంలోనే అరుదైన అవయవ మార్పిడి శస్త్రచికిత్సపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఏకబిగిన 36 గంటల పాటు శ్రమించి ఒకే రోగికి ఒకేసారి ఐదు అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రభుత్వ వైద్య రంగంలో ఇది ఒక గొప్ప విజయంగా అభివర్ణించారు. సిరిసిల్ల జిల్లాకు చెందిన 30 ఏళ్ల యువ ఇంజనీర్‌కు జీర్ణాశయం, డ్యూడెనమ్, ప్యాంక్రియాస్, చిన్నపేగు, పెద్దపేగు అవయవాలను ఒకేసారి మార్పిడి చేసినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం దేశంలోనే అత్యంత అరుదైన ఘట్టమని తెలిపారు. వైద్య బృందం నైపుణ్యం, అంకితభావానికి ఇది నిదర్శనమని కొనియాడారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in